



## ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

2

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం | 03 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08




# వైఎస్ స్ఫూర్తితో
# పేదలకు సేవలు

### పేదల ఆత్మబంధువు..వైఎస్

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**నార్కట్‌పల్లి, అక్షిత న్యూస్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంలలో ఆయన విగ్రహానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. "నాయకుడు అంటే ఎలా ఉండాలి, పేద ప్రజలకు ఏ విధంగా అండగా నిలవాలి అనే స్ఫూర్తిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చారు" అని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలు కీలకమని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ..మిగతా 2లో

# మా 1000 రోజుల ప్రగతి లెక్క ఇదిగో..

### మీ పదేళ్ల లెక్క ఏమిటో చెప్పండి

### రూ.2,389 కోట్ల అభివృద్ధి.. శ్వేతపత్రంతో లెక్క చెబుతాం!

### 10 ఏళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

### విపక్షాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్

### కేఎల్ఐ,పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండపై ఘాటు వ్యాఖ్యలు



**వనపర్తి, అక్షిత ప్రతినిధి:** ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శ్వేత పత్రం విడుదల చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రకటించారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు రూ.2,389 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆరు గ్యారంటీల అమలుకు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, తమ ప్రభుత్వం 1000 రోజుల్లో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే వారు గత పదేళ్లలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. "మా 1000 రోజుల అభివృద్ధి లెక్క ఇదిగో.. మీ పదేళ్ల ..మిగతా 2లో

# పక్కాగా సర్ ప్రక్రియ



### సర్-2026 నోటీసుల హియరింగ్, పరిష్కారం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**రంగారెడ్డి, అక్షిత బ్యూరో :** సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్) నోటీసుల హియరింగ్ ప్రక్రియలో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బండ్లగూడ, హైదర్‌షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ ప్రక్రియను ..మిగతా 2లో

# పటిష్టంగా ఎన్నికల నియమావళి

### సమగ్ర ఓటరు సవరణ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, అక్షిత బ్యూరో:** సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం కాశీబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం, వరంగల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. వరంగల్ ఆర్డీవోతో కలిసి ఆయా కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, సమగ్ర ఓటరు ..మిగతా 2లో

## పటిష్టంగా ఎన్నికల నియమావళి

**మొదటి పేజీ తరువాయి...**

సవరణకి సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి అంశాన్ని నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సర్ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి జిల్లాలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ ) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను ఈ సందర్భంగా సీఈఓ ఆదేశించారు. జిల్లాలో 'నో మాపింగ్ ' 'అనామాలీస్ ' కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. సంబంధిత పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శేరిలింగంపల్లి జోన్‌లో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్ స్ఫూర్తితో పేదలకు సేవలు

**మొదటి పేజీ తరువాయి...**



వైఎస్సార్‌దేనన్నారు. పేదలు, రైతుల కోసం ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కరువు, ఫ్లోరైడ్ సమస్యల పరిష్కారానికి ఉదయ సముద్రం ప్రాజెక్టు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టును పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించామని తెలిపారు. వైఎస్సార్ ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తామని, ఆయన మాట ఇచ్చిన తర్వాత వెనక్కి తగ్గని నాయకుడిగా ఉన్నట్లే తాము కూడా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నాయకులను పార్టీలోకి ఆహ్వానించడం మంచిదేనని, అయితే తమను పక్కన పెట్టే ప్రయత్నాలను మాత్రం సహించబోమని వ్యాఖ్యానించారు. రాబోయేది రాజశేఖర్‌రెడ్డి యుగమేనని, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగితే వారి తరఫున పోరాడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిరుమర్తి ధర్మయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మాజీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య, పబ్బతి రెడ్డి వెంకట్ రెడ్డి, కొమ్మనబోయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

### తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని మహబూబ్‌నగర్ ఎంపిడిఓ కె అరుణ అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాలానగర్ మండలంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎం.పి డి.కె అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడికె అరుణ మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. స్క్రీనింగ్‌లో అనుమానిత కేసులను గుర్తించి, వారికి తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాలు, ఉచిత లేదా తక్కువ ఖర్చుతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారం తదితర క్యాన్సర్ల లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని, ఆరోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాలికలకు హెచ్‌పీవీ టీకాపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని కోరారు.

'ఇంట్లో తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది' అని పేర్కొన్న ఎంపీ, ప్రతి ఒక్కరూ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ, మహిళలు కుటుంబ బాధ్యతలు వల్ల తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు అన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

అందువల్ల మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మహిళలందరికీ ఇటువంటి స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణకు, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఫౌండేషన్‌కు జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి మహిళలు పూర్తి సహకారం అందించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సహకారంతోనే కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.

స్క్రీనింగ్ అనంతరం క్యాన్సర్ అనుమానం ఉన్నవారికి అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడంతో పాటు, వారి చికిత్స ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రతి కేసును సున్నితంగా పరిగణించి, స్క్రీనింగ్ తర్వాత అవసరమైన తృతీయ స్థాయి చికిత్స అందేలా ఫాలోఅప్ చేయాలని సూచించారు.

స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులపై ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, సంబంధిత మహిళలు ఎక్కడ చికిత్స పొందుతున్నారు, వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమవుతోంది అనే వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థలు, వైద్యులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, అవసరమైన పరీక్షలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## "మా 1000 రోజుల ప్రగతి లెక్క ఇదిగో..



**మొదటి పేజీ తరువాయి...**

లెక్క ఏమిటో చెప్పండి" అంటూ ప్రతిపక్ష నేతలను నిలదీశారు.

**కేఎల్ఐపై ఎవరి వాటా ఎంత?**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి హయాంలో డీ–5, డీ–8, బుద్ధారం ప్రాంతాల్లో వేల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు పనులు జరిగాయని పేర్కొన్నారు. కర్నెతండా, బుద్ధారం, ఖిల్లాఘణపురం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి సుమారు 45 వేల ఎకరాలకు నీరందించే పనులకు టెండర్లు పూర్తయ్యాయని, 50 శాతం పనులు గతంలో జరిగితే మిగిలిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకోవడం సరికాదని, గతంలో చేసిన పనులకు ఇప్పుడు రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. కేఎల్ఐలో 90 శాతం పనులు పూర్తయిన తర్వాత మిగిలిన 10 శాతం పనులు చేసి మొత్తం తామే పూర్తి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

**"నా డబ్బులు తిన్నాలేదు అంటే వెంకటేశ్వరస్వామి గుడికి రండి"**

తనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలపైనా ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. "నేను కూలీని.. నా డబ్బులు పందికొక్కులు తిన్నారో లేదో తేల్చుకుందాం. వెంకటేశ్వర స్వామి గుడికి రండి.. నేను వస్తా.. మీరు సిద్ధమా?" అంటూ సవాల్ విసిరారు. తాను భూమి కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని, ఆ వ్యవహారానికి జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సాక్షిగా ఉన్నారని చెప్పారు. 39 గుంటల భూమిని ఎవరి పేరున రాసి ఇవ్వమన్నా ఇస్తానని పేర్కొన్నారు. దీనిపై రఘుపతిరెడ్డి మీడియా సమావేశం పెట్టి వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**"వెలిగొండపై పదేళ్లలో ఏం చేశారు?**

వెలిగొండ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ గత పదేళ్లలో ఏం చేశారో ప్రతిపక్ష నేతలు సమాధానం చెప్పాలని మేఘారెడ్డి ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి, వెలిగొండ, కేఎల్ఐ ప్రాజెక్టుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు రూ.182 కోట్లు చెల్లించామని, అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు.

**"ప్రధాన నాయకుడు ఎక్కడ?"**

బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే.. "1000 రోజుల్లో 22 కోట్ల జీతం ఇచ్చాం.. 22 రూపాయల పని చేశారా?" అంటూ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం లోటుపాట్లను సరిచేస్తూ 76 వేల ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు. పింఛన్ల విషయం లోనూ గత ప్రభుత్వాన్ని నిలదీశారు. వయస్సు పరిమితిని 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది ఎవరి ప్రభుత్వమో ప్రజలకు తెలుసన్నారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని వారు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు.

**"ప్రజల ముందే లెక్కలు తేల్చుకుందాం"**

డీసీసీ జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మేధావులమని చెప్పుకునే నాయకులు ప్రజలకు ఎలాంటి దారి చూపుతున్నారో ఆలోచించుకోవాలని అన్నారు. "మీకన్నా మేము మూడు ఆకులు ఎక్కువే చదువుకున్నాం. బూట్లు నాకే వ్యవస్థ ఎవరిదో ప్రజలకు తెలుసు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో అప్పుల చెల్లింపులకు భారీగా నిధులు వెచ్చిస్తూ, ఇరిగేషన్ రంగానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి, కేఎల్ఐ ప్రాజెక్టులను తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకునే ముందు గత పదేళ్ల లెక్క చెప్పాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. వనపర్తి నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్. మాజీ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా పార్టీ కార్యవర్గం, కౌన్సిలర్లు, సర్పంచు లు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజులు పూర్తవుతున్నా..
# కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు

### 420 హామీలతో 150 మీటర్ల ఫ్లెక్సీ ప్రదర్శన.. సిరిసిల్లలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ, ఆ హామీలన్నింటినీ ఒకే ఫ్లెక్సీలో ముద్రించారు. సుమారు 150 మీటర్ల పొడవైన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు.




సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేసేందుకే 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చేందుకు భవిష్యత్‌లో కూడా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి బొల్లి రామ్మోహన్ దార్ల సందీప్ సంపత్ చిన్న బత్తుల రమేష్ సాయి కృష్ణ చేరాల స్వాతి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెడ్లు లేక,నేలపైనే చిన్నారి చికిత్స

### గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల వార్డులో దయనీయ పరిస్థితి



**గద్వాల అక్షిత ప్రతినిధి:** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల వార్డులో బెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఓ పేషెంట్‌ను నేలపైనే పడుకోబెట్టి చికిత్స అందిస్తున్న పరిస్థితి కనిపించింది. ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపిల్లల వార్డులో రోగుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు చెబుతున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డులో అదనపు బెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, పరిశుభ్రత మరియు మౌలిక వసతులను మెరుగుపరచాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### నూతనంగా ఎన్నికైన మండల నాయకులకు
# సన్మానం చేసిన కాకి ఈశ్వర్ ముదిరాజ్



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కప్పల రాజు, కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ మండల ఆధ్యక్షుడు బుసనగారి స్వామి, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు పాట బాలరాజ్ లను సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు చిక్కిరి శ్రీకాంత్, మహేశ్వరం గ్రామ 10 వ వార్డు ఇన్చార్జ్ ముదిరాజ్ సంఘం గ్రామ ఉపాధ్యక్షులు కాకి మల్లేష్ ముదిరాజ్, మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి పట్టణంలో మాజీ సిఎం వైఎస్సార్ వర్ధంతి

### పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోని మున్సిపాలిటీ ఆఫీస్ ఎదురుగా మెయిన్ రోడ్ లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సందీప్ గౌడ్,కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచ్ లు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్షిత న్యూస్:** స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని జడ్చర్ల మున్సిపాలిటీలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## 39.4 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ నగరంలోని 6వ డివిజన్ ఏనుగొండలో 39.4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. నగర సమగ్ర అభివృద్ధిలో భాగంగా యూజీడీ వ్యవస్థను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పి. వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, 6వ డివిజన్ కార్పొరేటర్ అనుపటి రామస్వామితో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## రహదారి ఇలా.. పోయేదెలా..?



**కాశిబుగ్గ , అక్షిత న్యూస్:** వరంగల్ 21 వ డివిజన్ ఎల్ బి నగర్ లోని తారక రామ వీధి చిన్న గల్లీ పెద్ద కాల్వ పై (మోరి) 20 ఏళ్ల క్రితం నిర్మించిన స్లాబ్, సి.సి రోడ్డు పూర్తిగా ధ్వంస మైంది . పెద్ద గుంతలు పడడంతో స్థానికులు విద్యుత్తు స్తంభాన్ని అడ్డుగా వేశారు. రాత్రి వేళప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ద్విచక్ర వాహనదారులు తెలిపారు. దారిలో చెత్త చెదారం వేయడం వల్ల అధిక మొత్తంలో వేయడం వలన దుర్వాసన, దోమలు రావడంతో అనారోగ్య పాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై పోలీస్ అవగాహన సదస్సు




**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. నాగేశ్వరరావు, తిరుమలగిరి స్థానిక సబ్ – ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గుత్త వెంకట్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు సైబర్ క్రైమ్, పోలీస్ అక్క, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు.

సదస్సులో సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ, సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ ఆర్థిక మోసాలకు గురైతే, వెంటనే మొదటి గంట (గోల్డెన్ అవర్) లోపు 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం 'పోలీస్ అక్క' విభాగం నిరంతరం అందుబాటులో ఉంటుందని, వేధింపులకు గురైతే ధైర్యంగా పోలీసులను ఆశ్రయించవచ్చని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ నెరవేర్చిన కౌన్సిలర్ ఇర్షాద్



**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు ఎన్నికల సమయంలో వార్డు నంబర్ 7 ప్రజలకు ఇచ్చిన హామీని మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఇర్షాద్ అహ్మద్ నెరవేర్చే దిశగా ముందడుగు వేశారు. వార్డులోని నాలుగు ప్రాంతా లకు ప్రత్యేక పేర్లు ఏర్పాటు చేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బుధవారం జరిగిన తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పేర్ల ఏర్పాటుకు సంబంధించి తీర్మానం చేశారు. వార్డు లోని హుస్సేన్ నగర్, కోకిల కాటేజ్, సుప్రీం కాలనీ, విలేమూన్ చౌరస్తా ప్రాంతాలకు పేర్లు ఏర్పాటు చేయాలని, కౌన్సిల్‌లో ప్రతిపాదించి తీర్మానం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను అధికారికంగా కౌన్సిల్ తీర్మానం ద్వారా ముందుకు తీసుకెళ్లడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇర్షాద్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాటే తనకు ముఖ్యమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తానని, తెలిపారు. వార్డు అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మంత్రి కొండా సురేఖకు పదవి గండం లేనట్లే!

### ఒక్కో సారి అతి చేష్టలు నష్టం కలిగిస్తాయని ఇరుపక్షాలకు ఈ ఎపిసోడ్ రుజువు చేసింది



**వరంగల్, అక్షిత బ్యూరో:** రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తాజాగా కీలక మలుపుతిరిగినట్లు తెలుస్తోంది. ఆగష్టు 28న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ జన్మదినం సందర్భంగా ఆమె కూతురు కొండా సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తొలగిస్తారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లోని గల్లీ రగడ కాస్తా ఢిల్లీ గడపను తాకింది.

ఈ సందర్భంగా మంగళవారం మంత్రి కొండా సురేఖ ఇతర మంత్రులు ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, అధిష్ఠానం దూత కేసీ వేణుగోపాల్ కొండా సురేఖకు అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఆమెకు అండగా నిలిచినట్లు తెలుస్తోంది. సురేఖ మంత్రి పదవి పోతుందని భావించిన కాంగ్రెస్ నాయకులు, ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడిన వారికి షాక్ తగిలినట్లు సమాచారం. కాగా రాష్ట్రంలో మంత్రి పదవిలో ఉన్నప్పటికీ కొండా సురేఖ కూతురు చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను ఆమెకు ఆపాదించడం సరికాదని అధిష్ఠానం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో కథ పూర్తిగా యూటర్న్ తీసుకుందని కాంగ్రెస్ లో ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలను బూచిగా చూపి మంత్రి సురేఖను ఒంటరిని చేసి కార్నర్ చేద్దామనుకున్న తరుణంలో, అధిష్ఠానం నుంచి ఆమెకు కొండంత దన్ను లభించిందని సమాచారం. ఇద్దరు ఏఐసీసీ జనరల్ సెక్రటరీలు, రాష్ట్ర కేబినెట్‌లోని ఇద్దరు కీలక మంత్రులు, పీసీసీ ముఖ్య నేత కొండా సురేఖకు బాసటగా నిలిచినట్లు సమాచారం. అధిష్ఠానం అండదండలతో సురేఖకు ఉపశమనం కలిగినట్లేనని తెలుస్తోంది.

చివరి నిమిషంలో సురేఖ వైపు.. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విషయంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు బీసీ సామాజిక వర్గం నుంచే షాక్ తగిలిందని ప్రచారం జరుగుతోంది. సురేఖపై వేటుకు సహకరిస్తే బీసీ సమాజం క్షమించదంటూ బీసీ నేతలు ఏకతాటిపైకి వచ్చి హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ బాస్ వైఖరిని మార్చుకోక తప్పలేదని సమాచారం. రేవంత్ రెడ్డికి జై కొడితే బీసీల ఆగ్రహజ్వాలల్లో చిక్కుకుంటామని గ్రహించి, చివరి నిమిషంలో సురేఖకు అండగా నిలిచే స్టాండ్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ను వెంటబెట్టుకుని వెళ్లి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ముందు తమ వాణి వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి వ్యూహామే రచించారని, కానీ అధిష్ఠాన పెద్ద వేణుగోపాల్ ఆ వాదనలను ఏమాత్రం ఆమోదించలేదని తెలుస్తోంది. సురేఖ వాదనలోని బలాన్ని, వెనకుండి నడిపిస్తున్న ఏఐసీసీ ముఖ్యుల ఒత్తిడిని గమనించిన అధిష్ఠానం సీఎం ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి మొదటి సారిగా చెస్ ర్యాపిడ్ ఫార్మేట్‌లో అంతర్జాతీయ ఫీడే రేటింగ్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థులకు క్రీడలు చాలా ఉపయోగపడతాయని మరియు ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించడమే కాకుండా రోజు వారి కార్యకలాపాలను చాలా హుషారుగా చేయడానికి దోహదపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థికి చెస్ లో అంతర్జాతీయ ఫిడే ర్యాంకింగ్ రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వివిధ స్థాయిలలో విజయాలను నమోదు చేయడానికి సహకరిస్తాయని. ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొనాలని మరియు క్రీడల పట్ల అవగాహన పెంపొందించుకొని ముందుకు సాగాలని చెప్పారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థులు జ్ఞాపక శక్తితో పాటు చక్కటి ఆలోచన విధానంపై పట్టు సాధించిన వారవుతారని గుర్తు చేశారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే వివిధ క్రీడలలో శిక్షణ ఇప్పిస్తూ పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను వివిధ స్థాయిలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో పాఠశాలకు చెందినటువంటి కే.స్నితిక్ రెడ్డి, 3వ తరగతి, హైదరాబాద్ లో నిర్వహించినటువంటి అండర్ 13 జూనియర్ చెస్ ఛాంపియన్షిప్ లో తన మొట్టమొదటి అంతర్జాతీయ ఫీడే రేటింగ్ సాధించడం చాలా గొప్ప విషయమని విజేతను ప్రశంసిస్తూ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో మరో ముందడుగు విద్యాభివృద్ధికి అట్టేపల్లి రామప్రభు కీలక నిర్ణయం..

### స్టాలిన్ నగర్ పాఠశాలకు వాలంటీర్ ఉపాధ్యాయురాలిగా గంగోలు భవిత నియామకం..



**మియాపూర్ అక్షిత ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తూ అట్టేపల్లి రామప్రభు మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్టాలిన్ నగర్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు గంగోలు భవితను వాలంటీర్ ఉపాధ్యాయురాలిగా అట్టేపల్లి రామప్రభు చైర్మన్ అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. విద్య కోసం ఏ విద్యార్థి ఇబ్బంది పడకూడదు. ప్రజలకు అవసరమైన చోట అండగా నిలవడమే మా లక్ష్యం సేవ అనేది ప్రచారం కోసం కాదు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రజలకు అవసరమైన అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉచిత అంబులెన్స్ సేవలు, అత్యవసర సమయాల్లో ప్రజలకు సహాయం, మహిళలు మరియు ప్రమాద బాధితులకు అత్యవసర రవాణా సహాయం, అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు విద్యా పరమైన సహకారం, పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు వంటి కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సాధ్యమైన పరిష్కారాలు చూపిస్తూ ముందుకు సాగుతున్న అట్టేపల్లి రామప్రభు.. ప్రజాసేవే లక్ష్యంగా, విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి. నాగేశ్వర్, ఎస్. తిరుపతియమ్మ, ఎన్. సుష్మ లతో పాటు స్టాలిన్ నగర్ కాలనీ వాసులు మోహన్, దస్తప్పా, ప్రదీప్, సాయి గౌడ్, కోటంగారి శ్రీను, శరత్, రఘు గౌడ్, శేఖర్ ముదిరాజ్, భాగ్యమ్మ వెంకటస్వామి, నర్సింహ, శ్రీకాంత్, శివ, కమల్, వేదాంత్, సతేష్, గని, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏ ఆర్ పి టీమ్ సభ్యులు అట్టేపల్లి సోమేశ్వర్, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్, అట్టేపల్లి చరణేష్, హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

### ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగ్రత్త దివాస్


### జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల అక్షిత న్యూస్:** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు.

సైబర్ నేరాల నివారణలో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న "సైబర్ జాగ్రత్త దివాస్" కార్యక్రమంలో భాగంగా బుదవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు విడుదల చేశారు.




ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలను వినియోగించే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తెలియని లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, మోసపూరిత కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.




సైబర్ మోసాల నుంచి రక్షణకు ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు వినికిడి, చూపు, స్పర్శ, వాసన, అభిరుచి వంటి పంచేంద్రియాల సమాచారాన్ని అనవసర యాప్‌లు లేదా వెబ్‌సైట్లకు ఇవ్వకూడదు.

తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్, ఆన్‌లైన్ చాటింగ్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. అనుమానాస్పద లింకులు, ఫేక్ మెసేజ్‌లు, తెలియని యాప్‌లను ఓపెన్ చేయకూడదు. తెలియని వ్యక్తులు పంపిన లింకుల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు అడిగినప్పటికీ ఓటిపి, పిన్ , పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. పబ్లిక్ వైఫై అనుమానాస్పద నెట్‌వర్క్‌లలో బ్యాంకింగ్ లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. మొబైల్ ఫోన్, యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్లు ఏర్పాటు చేసుకోవాలి.

అవసరం లేని యాప్‌లకు కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్ వంటి అనుమతులు ఇవ్వకూడదు. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు.

భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను మోసం చేసే అవకాశం ఉన్నందున, వెబ్‌సైట్ యొక్క సరైన అడ్రస్‌ను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా, వీలైనంత వరకు నమ్మకమైన వెబ్‌సైట్లు, అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే షాపింగ్ చేయాలని సూచించారు. డిజిటల్ చెల్లింపుల్లో అప్రమత్తత అవసరం ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అధికారి, యూపీఐ ప్రతినిధి లేదా ఇతర సంస్థల ప్రతినిధినని చెప్పినా వెంటనే నమ్మవద్దని తెలిపారు. ఎస్ఎంఎస్, ఇమెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. యూపీఐ ద్వారా డబ్బు పొందడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, డబ్బు పంపే సమయంలో మాత్రమే జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఫోన్ కాల్‌లో ఎవరైనా బ్యాంకు వివరాలు, ఓటిపి, పిన్ లేదా పాస్‌వర్డ్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు.

**అప్రమత్తతే సైబర్ భద్రతకు మొదటి అడుగు**

సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, సైబర్ నేరాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, ఎస్బైలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత

### చౌటుప్పల్ సీఐ జి.మన్మధ కుమార్



**చౌటుప్పల్/అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం, దండు మల్కాపూర్ పరిధిలో శ్రీజయ ల్యాబ్స్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని సీఐ మన్మధ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కంపెనీ సిబ్బందికి రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ సిబ్బంది,శ్రీజయ ల్యాబ్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలులో విఫలం: బీఆర్ఎస్

### తాండూరులో భారీ ర్యాలీ, మహా ధర్నా




**తాండూరు అక్షిత ప్రతి నిధి:** తాండూరు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజల సమస్యలు పరిష్కరించ లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు తాండూరులో భారీ ర్యాలీ, మహా ధర్నా నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రస్తావిస్తూ, 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే, తాము వెనక్కి తగ్గబోమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, చెప్పారు. ధర్నాతో తాండూరులో రాజకీయ నెలకొంది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండాలి

### సింగరేణి ఏరియా ఆసుపత్రిలో డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్ తనిఖీ



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అంబులెన్స్‌ల పనితీరు, అత్యవసర వైద్య సేవల సన్నద్ధతను డీవైసీఎంవో డాక్టర్ మధుకుమార్ విధుల్లో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లలోని ఆక్సిజన్ సిలిండర్లు, ఫ్లో మీటర్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, స్ట్రెచర్లు, ప్రాణరక్షక మందుల లభ్యతను స్వయంగా పరిశీలించారు. వాహనాల ఫిట్‌నెస్, బ్యాటరీ కండిషన్, సైరన్ తదితర సాంకేతిక వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అత్యవసర సమయాల్లో గని కార్మికులు, వారి కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్యం అందించేందుకు అంబులెన్స్ విభాగం 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎమర్జెన్సీ కాల్ వచ్చిన వెంటనే వేగంగా స్పందించాలని డ్రైవర్లు, సిబ్బందిని ఆదేశించారు. లాగ్‌బుక్ వివరాలను ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, పారామెడికల్ అధికారులు పాల్గొన్నారు.

# కవితమ్మ మీద సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

### గుంజపడుగు హరిప్రసాద్

### జిల్లా అధ్యక్షుడు తెలంగాణ రక్షణ సేన

**కరీంనగర్ అక్షిత న్యూస్:** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు కమెంట్స్ పెట్టిన వారిమీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం కరీంనగర్ లోని ఒకటోవ పోలిస్ స్టేషన్ లో జిల్లా పార్టీ బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆద్వర్యంలో పోలిసులకు పిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ మీద అసభ్యకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కవితమ్మ మీద సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, మరియు (ట్విట్టర్) మరియు ఇతర సోషల్ మీడియా గ్రూపులలో అత్యంత అసభ్యకరమైన, అవమానకరంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ కె అనిల్ మీద తక్షణమే చట్టపరంగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేయడం జరిగిందని



తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళ నాయకురాలి మీద అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసి కవితమ్మ గౌరవాన్ని ప్రతిష్టను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం యావత్ మహిళలోకానికి జరిగిన అవమానంగా భావించాలని. కానిస్టేబుల్ అనిల్ చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు అన్నారు. పవిత్రమైన పోలిస్ ఉద్యోగంలో ఉన్న అనిల్ ప్రజలకు చట్టపరంగా రక్షణ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన ఒక బాధ్యత కలిగిన పోలీస్ ఉద్యోగంలో ఉండి ఈ విధంగా ఒక మహిళా రాజకీయ నాయకురాలిని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం పైన అతడి వెనుక ఉన్న వ్యక్తులు ఎవ్వరూ అనేది కూడ తేల్చాలి. పోలీస్ శాఖ కూడ అతడి మీద శాఖాపరమైన విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, మనకోండుర్ నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, చొప్పదండి నియోజకవర్గం నాయకులు మ్యాకల తిరుపతి, జిల్లా పార్టీ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, బసవేణి రాజేందర్, యండి హుస్సేన్, యండి రాజీ, మడిపల్లి వినీత్, బాండారి అభిరామ్, జిల్లా మహిళ నాయకురాలు జంగ అపర్ణ, అసియా సుల్తానా, పల్లె శారద, తుట్టేవార్ అకాష్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** నల్లగొండ జిల్లా చర్లపల్లి లో సెప్టెంబర్ 1 బుధవారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్బాల్ గర్ల్స్ జూనియర్ అసోసియేషన్ చే నిర్వహించిన జూనియర్ బాలికలు అండర్ -17 పోటీలో ఎంపిక పోటీలో చౌటుప్పల్ మండలం,దండు మల్కాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవతరగతి విద్యార్థిని యు.మేఘన సెప్టెంబర్ 4వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిజాంబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు శోభ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు గ్రామ సర్పంచ్ నిరంజన్ గౌడ్ ఆర్థిక సహాయం అందజేస్తానని తెలిపినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిరంజన్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహ, ఎంఈవో గురువా రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ,పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భావన, ఉపాధ్యాయ బృందము పాల్గొని క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించి జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందాలని ఆకాంక్షించారు.

## వరంగల్ బస్ స్టాండ్ నిర్మాణం పరిశీలన

### రోడ్డు భద్రత సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, అక్షిత బ్యూరో:** రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బుధవారం సంబంధిత శాఖల, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణం లో పనులను, రోడ్డులో ఏర్పడుతున్న నీటి నిలువలు,గుంతలు వలన ట్రాఫిక్ జామ్, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

అలాగే లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్ పరిధికి పరిశు భ్రంగా ఉండేలా చూడాలని, వానకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలను, నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

క్షేత్ర స్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# తండ్రి ఆశయాలంటే అక్రమ కేసులు పెట్టించడమా

### ఆరు గ్యారెంటీలు అమలు చేసినంకనే ఓట్లకు రావాలే

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**పెద్దపెల్లి అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో 420హామీలపై ఎక్కడైనా కేసులు పెట్టాల్సి వస్తే దానిలో మొదటి ముద్దాయి దుద్దిళ్ల శ్రీధరేనని, ఆయనపై కేసు నమోదు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వేయి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన తో నిరసన కార్యక్రమం చేపట్టి, బాకీ కార్డులు పంపిణీ చేశారు... ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వేయి రోజులు గడిచినా ఒక్క హామీ నెరవేర్చని చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. చదువుకున్న వ్యక్తి అని తండ్రి కొడుకుల రూపాలు చూసి నియోజకవర్గ ప్రజలు ఎనిమిదిసార్లు ఓట్లు వేస్తే మంథని ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలను దుద్దిళ్ల కుటుంబం మోసం చేసిందని విమర్శించారు. గొప్పగా మానిఫెస్టో రాసిన దుద్దిళ్ల శ్రీధర్ ఆ మానిఫెస్టోను మర్చిపోయాడని, హామీలు అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికే పోలీసులకు చెప్పామని అన్నాతమ్ముళ్లు చెప్పినట్లు వింటే అబాసుపాలు అవుతారని,అయినా కేసులు పెట్టి కోర్టులో చివాట్లు తింటున్నారని ఆయన తెలిపారు. తొమ్మిదిన్నర ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం దగా పడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టేలా మానిఫెస్టో రూపొందించామని దుద్దిళ్ల శ్రీధర్ గొప్పలు చెప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని హామీలు అమలు చేసి తెలంగాణను బంగారు బాటలో నడిపిస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ప్రతీసారి తండ్రి ఆశయాల కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్తున్న దుద్దిళ్ల శ్రీధర్ అసలు తండ్రి ఆశయాలేంటో చెప్పడం లేదన్నారు. సొంత గ్రామమైన ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో బెంచీలు, ఫ్యాన్లు సౌకర్యాలు లేక ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారని, కనీసం పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని, ఒక బెంచీ వేయించాలని దుద్దిళ్ల కుటుంబం ఏనాడు ఆలోచన చేయాలేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టించి జైలు పాలు చేయడమేనా మీ తండ్రి ఆశయాలని ఆయన విమర్శించారు. 420హామీలు కాకుండా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ఆయన ప్రశ్నించారు. ప్రతి మహిళలకు 2500, 500లకే గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామని, పింఛన్‌లు పెంచు తామని చెప్పారని, రైతుభరోసా, రైతు కూలీలకు 12వేలు, క్వింటాల్ వడ్లకు బోనస్, గృహజ్యోతి అని చెప్పి ఏ ఒక్కటి అమలు చేయకుండా మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా ఉంటాడని, మంత్రులు ఇక్కడికి వచ్చి మరీ గొప్పలు చెప్పారని, ముఖ్యమంత్రి ఏం చెప్పాలన్నా దుద్దిళ్ల శ్రీధర్ ద్వారానే చెప్పుకుంటామని పొగిడారని, కానీ అందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి 3వేల ఇందిరమ్మ ఇండ్లు తెస్తే మంథని ఎమ్మెల్యే మంత్రి అయి ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడై 3వేల ఇండ్లు తెచ్చాడని ఆయన ఎద్దేవా చేశారు. అంటే మంత్రి పదవిని అడ్డు పెట్టుకుని తమ్ముడికి హైదరాబాద్‌లో నాలుగు ఆఫీసులు పెట్టించి వేల కోట్లు సంపాదించుకోవడానికేనా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో ఏటీఎం కార్డులు చూపించి యువతను, విద్యార్థులను మోసం చేసిన ఘనత దుద్దిళ్లదేనని అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఏది అని అడిగితే కేసులు పెట్టించాడని ఆయన గుర్తు చేశారు. దేశంలో చదువుకున్న సన్నాసి ఎవరైనా ఉన్నారంటే అది దుద్దిళ్ల శ్రీధరేనని ఆయన విమర్శించారు. మంథని ప్రజలు ఎనిమిదిసార్లు ఓట్లు వేసి గెలిపిస్తే మంథనికి అపకీర్తి తీసుకువస్తున్నారని, మానిపెస్టో రాసింది మంథని ఎమ్మెల్యేనా అని రాష్ట్ర ప్రజలంతా నవ్వుకుంటున్నారని అన్నారు. అబద్దాలతో ఇంకా మంథని ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాడని, హామీలు అమలు చేయకపోగా విదేశాలకు పోయి సిపాయి మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని ఇబ్బందులు పెట్టినా మానిఫెస్టోను ప్రజలకు చూపిస్తామని అన్నారు. మంథని అభివృద్ధి, భవిష్యత్ గురించి ఏనాడు ఆలోచన చేయడం లేదని, రోడ్ల విస్తరణ పేరుతో వ్యాపారాలను రోడ్డున పడేశాడని వాపోయారు. కూల్చివేతల్లో టౌన్‌లో ఒక న్యాయం రోడ్డు మీద వాళ్లకు ఒక న్యాయం చేస్తున్నారని, పట్టణంలో రోడ్ల విస్తరణ సమయంలో పరిహారం ఇచ్చారని, ఇక్కడ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. వ్యాపారులు సైతం పరిహారం కోసం ప్రశ్నించకుండా ఉంటున్నారని, కేవలం దుద్దిళ్ల శ్రీధర్ , కాంగ్రెస్ పార్టీ అంటే భయపడుతున్నారని ఆయన అన్నారు. అధికారులు, పోలీసులను వాడుకుని ఎలా భయపెడుతున్నాడో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. నియోజకవర్గాన్ని అబాసుపాలు చేసిన దుద్దిళ్ల శ్రీధర్ అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేసిన తర్వాతనే ఓట్లు అడుగాలని ఆయన డిమాండ్ చేశారు .

# ఘణంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మేడ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మేడ రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, ఆదర్శవంతమైన రాజకీయాల కోసం నిరంతరం శ్రమిస్తున్న పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు. సమాజంలో మార్పు కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ పడుతున్న తపన ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ జన్మదిన వేడుకల సందర్భంగా సామాజిక మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్ల పంపిణీ నిర్వహించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. దీనితో పాటు భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మేడ రామకృష్ణ గారితో పాటు పార్టీ నాయకులు, విశేష సంఖ్యలో హాజరైన కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ప్రజలకు సేవ చేసేందుకు ఆయనకు మరింత శక్తి లభించాలని నాయకులు ఆకాంక్షించారు. జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కట్టుబడి పనిచేయాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మేడ రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.లి

లిమరొక సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక అనాథాశ్రమ పాఠశాలలో విద్యార్థులకు, చిన్నారులకు పండ్లు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడమే ధ్యేయమని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనా రాష్ట్ర అధికార ప్రతినిధి పెందం హైందవి రెడ్డి తో పాటుగా జిల్లా నాయకులు రాఘవేందర్, చిల్లా జనార్దన్ రెడ్డి, శ్రీవల్లి, కనకదుర్గ, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం అవుతామన్న

# కె.సి.ఆర్ మాట నిజమైంది

### ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్ రెడ్డికి పాలించే నైతికత లేదు

### కె.సి.ఆర్ పాలన రావడం తథ్యం... సంక్షేమం సాగడం ఖాయం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం అవుతామన్న కె.సి.ఆర్ మాట నిజమైందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్ రెడ్డికి పాలించే నైతికత లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ 1000రోజుల పాలన వైఫల్యంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమరభేరి మోగించారు. రాజీవ్ చౌరస్తాలో జరిగిన నిరసన సభలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం అవుతామన్న కె.సి.ఆర్ మాట నేడు నిజమైంది అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పాలించే నైతికత లేదని దుయ్యబట్టారు. కె.సి.ఆర్ సంక్షేమ పాలన మళ్ళీ రావడం తథ్యం అని సుభిక్షంగా పాలన సాగడం ఖాయమని ప్రజలు అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెల్లువలా తరలివచ్చిన మహిళలను చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం దినాలు దగ్గర పడ్డాయన్న ఖచ్చితంగా చెప్పగలనన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలు,420హామీలు,11డిక్లేషన్లు ఒక్కటిగా వివరిస్తూ అమలు జరిగాయని మహిళలను ప్రశ్నిస్తే లేదు లేదు అని ముక్తకంఠంతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చి అభివృద్ధి నీ అగ్రభాగములో నిలిపిన కె.సి.ఆర్ ని తూలనాడడం రేవంత్ రెడ్డికి తగదని హెచ్చరించారు. 33నెలల పాలన ముప్పేట పలు చేసింది,100రోజులు గడువు హామీలు 1000రోజులైనా రాలేదు, సిగ్గులేకుండా హెడ్ లైన్లో పేపర్ ప్రకటనలు, ఉద్యోగస్తులు రేవంత్ రెడ్డికి శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వారం రోజుల పాటు పిండప్రదానం ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు నమ్మే పరిస్థితిలో కాంగ్రెస్ లేదు, రైతులు నమ్మి హరిగోస పడుతున్నారు, రెప్పపాటు కరెంట్ కోతలు లేకుండా కె.సి.ఆర్ చేశారని చెప్పారు. యూరియా కోసం రోడ్లపై పడిగాపులు పడాల్సివస్తుందని, నికర జలాలు ఆంధ్రావాళ్ళు దోచుకుపోతుంటే రేవంత్ మొద్దు నిద్ర విడడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు మెప్పు కోసం రేవంత్ రైతులను దగా చేస్తున్నాడని మండిపడ్డారు. గురువు కళ్లలో ఆనందం కోసం రేవంత్ పిల్లిమొగ్గలు అని అన్నారు. మోదీ, చంద్రబాబు, రేవంత్ ఒక్కటై తెలంగాణ నీటి వాటాను ఆంధ్రకు అందిస్తున్నారని, 1000రోజులలో లక్షా అబద్దాలతో రేవంత్ పాలన కొనసాగిందని ఎద్దేవా చేశారు. ఓట్లులతో దేవుళ్ళను సహితం రేవంత్ మోసం చేస్తున్నారని, వై.ఎస్.ఆర్ ఫీజ్ రియాంబర్స్మెంట్ కె.సి.ఆర్ కొనసాగించారని చెప్పారు. విదేశీ విద్య కోసం 20లక్షలు కె.సి.ఆర్ అందించారు, నిరుద్యోగ భృతి ఒక్కొక్కరికి 2లక్షల 30వేలు సర్కార్ బకాయి పడ్డదని, కె.సి.ఆర్ 2లక్షల 5వేల మందికి ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి 1లక్షా 63వేల ఉద్యోగాలు కె.సి.ఆర్ ఇచ్చి 43వేల ఉద్యోగాలకు సర్వం సిద్ధం చేశారని చెప్పారు. రేవంత్ 100రోజులలో 2లక్షల ఉద్యోగాలు అని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. కె.సి.ఆర్ ఆచరించిన వ్యవసాయ అభివృద్ధి వల్ల 2.5కోట్ల మందికి ఉపాధి కె.సి.ఆర్ కల్పించారని, నూతన పరిశ్రమల వల్ల కె.సి.ఆర్ 16లక్షల యువతకు ఉపాధి కల్పించారని చెప్పారు. కె.సి.ఆర్ హయాములో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు 9లక్షల మందికి ఉపాధి కల్పించారు, అవ్వ తాతలకు 4000 అంటూ వృద్ధులను మోసం చేసింది కాంగ్రెస్ సర్కార్ కాదా అని విమర్శించారు. నమ్మితే ఆగం అయితారు అని నాటి కె.సి.ఆర్ మాట నిజమైందని, తెలంగాణ సమాజాన్ని హోల్ సెల్ గా కాంగ్రెస్ మోసం చేసిందని, ముఖ్యమంత్రి సామూహిక బాధ్యత అని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో నేను అన్న నియంత మునిగిపోవడం ఖాయం, ప్రజలను ఏమార్చితే నిన్ను బొంద పెట్టడం ఖాయమని జోష్యం చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయింది పాలించే నైతికత లేదని, ఉలికి ఉలికి పడే నాయకులకు ప్రజలు గుణపాఠం చెబుతారని, ఇందిరమ్మ ఇండ్లపేరిట ప్రచారానికి వేల కోట్ల దుబారా చేశారని ఆరోపించారు. కె.సి.ఆర్ పాలన రావడం తథ్యం సంక్షేమం సాగడం ఖాయమని అన్నారు. ప్రజలకు అండగా మేము ఉంటాం అధైర్యపడొద్దు, భారీ ఫ్లెక్సీ ప్రదర్శన సభాస్థలిలో ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీ చెందిన మోసపు హామీలు వివరిస్తూ 420ఫీట్ల భారీ ఫ్లెక్సీ సభికులను విశేషంగా ఆకర్షించిందని తెలిపారు. 6గ్యారంటీలు,420హామీలు,11డిక్లరేషన్లు ఇచ్చి మోసం చేసిన రేవంత్ రెడ్డి బాగోతాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడంతో మహిళలు ఉద్వేగంగా మాట్లాడుతూ కాంగ్రెస్ చెడిన మోసపు హామీలు తలుచుకొని శాపనార్థాలు పెట్టారని అన్నారు. జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాకిటి.శ్రీధర్,రమేష్ గౌడ్, బి.లక్ష్మయ్య, నందిమల్ల.అశోక్,లక్ష్మారెడ్డి,కృష్ణా నాయక్, గంధం.పరంజ్యోతి,రాజానగరం. విజయ్ కుమార్,వెంకట్ సాగర్, కె.మాణిక్యం, వనం.రాములు, రాళ్ళ.కృష్ణయ్య, వెంకటస్వామి, ఏం.తిరుపతయ్య,మాజీ కౌన్సిలర్స్ ఉంగ్లం. తిరుమల్,నాగన్నయాదవ్,బండారుంకృష్ణ,కాగితాల. లక్ష్మీనారాయణ, కౌన్సిలర్స్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్,స్వాతి హరిబాబు,శంకరమ్మ బాబు నాయక్,ఏర్వ.అరుణ శ్రీనివాసులు, శిరీష రమేశ్ గౌడ్, హేమంత్ ముదిరాజ్, ఇమ్రాన్, రఘువర్ధన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి,సర్పంచులు శోభా,నాగమ్మ,కవితా నాయక్, షెమీం బేగం,జమ్ములమ్మ,నాయకులు ఏం. వేణుగోపాల్, పలుస.శంకర్ గౌడ్,నందిమల్ల. రమేష్,గులాం ఖాదర్ ఖాన్, నీలస్వామి, బొబ్బిలి.ప్రేమ్ కుమార్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల. రాము, మంద.రాము,సిరిగిరి.మన్నెం,బాలరాజు వాల్మీకి, శిరీవాటి.శంకర్, అలీమ్, నందిమల్ల. సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినికి శ్రీనివాస్ చేయూత...

### ఎంబీబీఎస్ సీటు సాధించిన ముత్తవ్వకు రూ.10 వేల ఆర్థిక సాయం...



**లోకేశ్వరం, సెప్టెంబర్ 2 (అక్షిత న్యూస్):** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అమ్మానాన్నలు లేకపోయినా పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని తోకల ముత్తవ్వ,కు దాతృత్వం అండగా నిలిచింది.లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన తోకల ముత్తవ్వ,ఇటీవల వైద్య విద్య ప్రవేశాల్లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించింది.అయితే తల్లిదండ్రులు లేకపోవడంతో వైద్య విద్యను కొనసాగించేందుకు అయ్యే ఖర్చులు భారంగా మారాయి.ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన లక్కంపల్లి ధర్మారం శ్రీనివాస్,ఆమెకు అండగా నిలిచారు.తోకల ముత్తవ్వ, వైద్య విద్య కోసం బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పేదరికంలోనూ పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన ముత్తవ్వ,ను ప్రోత్సహిస్తూ శ్రీనివాస్ సాయం చేయడాన్ని గంగపుత్ర సంఘం సభ్యులు గ్రామ సర్పంచ్ దర్వాడి కపిల్ అభినందించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా దాతలు అండగా నిలవాలని కోరారు.ముత్తవ్వ ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తిచేసి వైద్యురాలిగా ఎదగాలంటే రాబోయే రోజుల్లో చదువుకు సంబంధించిన మరిన్ని ఖర్చులు ఉంటాయని గంగపుత్ర సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మానాన్నలు లేని ముత్తవ్వ వైద్య విద్యకు మరింత మంది దాతలు ముందుకొచ్చి తమవంతు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఒక ప్రతిభావంతురాలి వైద్య విద్యకు అందించే ప్రతి సహాయం ఆమె భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించిన శ్రీనివాస్‌కు గంగపుత్ర సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్,రమేష్ గౌడ్, రమణరావు, రామారావు, గణేష్, రాజేశ్వర్,సంఘ సభ్యులు భూమేష్, మచ్చేందర్, ముత్యం,శ్రీకాంత్,సాగర్ తదితరులు పాల్గొన్నారు...

## వృద్ధులకు చేతి కర్రలు, స్టాండ్లు అందజేత



**చౌటుప్పల్ / అక్షిత న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చౌటుప్పల్‌లో జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంను పట్టణ కేంద్రంలోని జయశ్రీ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మేకల సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు 80 చేతి కర్రలు స్టాండ్లు వారి చేతుల మీదుగా అందజేశారు.

అనంతరం శ్రీ మేకల సతీష్ రెడ్డి,ఆముదాల పరమేశ్ లు మాట్లాడుతూ.. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రజాసేవ, సమాజ సేవ పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం వేడుకలకు పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మేకల సతీశ్ రెడ్డి, ఆముదాల పరమేశ్, పీక ప్రవీణ్ కుమార్,పల్చం శ్రీకాంత్, బొల్లం మల్లేశ్, పెద్దగొని లింగస్వామి, ప్రశాంత్, బద్రి రాజు, కునూరు శ్రీకాంత్ సంజయ్, కృష్ణ రెడ్డి,సుల్తాన్ రాజు.రమణబాబు, శివరామ్ ,నిఖిల్,తేజ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులుస్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళులు

### వైఎస్సార్ ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు సాగాలి: ఎమ్మెల్యే





**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజా సంక్షే మానికి కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఘనంగా హరితహారం కార్యక్రమం..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** శేరిలింగంపల్లి నియోజక వర్గం మియాపూర్ డివిజన్‌లోని స్టాలిన్ నగర్ మండల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, చెట్లను విరివిగా పెంచడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. “పచ్చని చెట్లు -- ప్రగతికి మెట్లు” అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు.

పాఠశాలల్లో విద్యార్థులకు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రామప్రభు పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా హరితహారం కార్యక్రమానికి మరింత సార్థకత చేకూరుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి. నాగేశ్వర్, ఎస్. తిరుపతియమ్మ, ఎన్. సుష్మ, అలాగే స్టాలిన్ నగర్ కాలనీ వాసులు మోహన్, దస్తప్పా, ప్రదీప్, సాయి గౌడ్, కోటంగారి శ్రీను,శరత్,రఘు గౌడ్, శేఖర్ ముదిరాజ్, వెంకటస్వామి, నర్సింహ, శ్రీకాంత్, శివ, కమల్, వేదాంత్, సతేష్, గని, నవీన్ పాల్గొన్నారు. అదేవిధంగా ఏ ఆర్ పి టీమ్ సభ్యులు అట్టేపల్లి సోమేశ్వర్, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్, అట్టేపల్లి చరణేష్, హరి బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## దాతృత్వం చాటుకున్న పబ్బు రాజు గౌడ్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం, ఎస్ లింగోటం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కందగట్ల వెంకటాద్రి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇట్టి విషయాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తెలియజేయగా వారు మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ కి తెలియజేశారు. వెంటనే మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ స్పందించి మానవతా దృక్పథంతో 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని లక్కారంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉండాల్సిన బాధ్యత నాయకుల మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్,, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, నాయకులు మోగదాల రమేష్ గౌడ్,మాజీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,సర్పంచులు,ఉప సర్పంచులు,మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



### నివాళులర్పించిన ఎమ్మెల్యే మందుల సామేలు

**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రమైన తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు వారు మాట్లాడుతూ... అగణిత ప్రజా సంక్షేమ పథకాలతో తెలుగు ప్రజల గుండెల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో పేదల జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్ధన్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మిలాల్ నాయక్, పిఎసిఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, మాజీ కౌన్సిలర్ గుగులోతు భాస్కర్, వార్డు ఇన్చార్జి పత్తేపురం సుధాకర్, తుంగతుర్తి నియోజకవర్గ ప్రెస్ క్లబ్ కన్వీనర్ కందుకూరి లక్ష్మయ్య, పిఎన్ఆర్ నరేష్, బోండ్ల వంశి , ప్రజాప్రతినిధులు వెంకన్న, ధరావతు రాజశేఖర్,బానోతు లక్ష్మణ్ నాయక్, గుగులోతు సుధాకర్ నాయక్, ధరావతు చిరంజీవి, చింతకాయల సుధాకర్, నాయిని కృష్ణ, పరదేశ్, రాకేష్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు నివాళులు అర్పించారు.

# రికార్డులు బయటపెడతారా.. దాస్తారా?

**ఇసుక ర్యాంపులపై ఆర్టీఐ దరఖాస్తుతో అధికార యంత్రాంగానికి ప్రశ్నలు**

**సమాచారం దాస్తున్నదెవరు.. దేనికోసం?**

**పీసా చట్ట నిబంధనలు, గ్రామసభ తీర్మానాల అమలుపై స్పష్టత కరవు**

**చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రికార్డుల లభ్యతపై వెల్లువెత్తుతున్న అనుమానాలు**

**గ్రామ పంచాయతీల ఆదాయంపై నిగ్గు తేలనున్న నిజాలు**

**కోట్ల రూపాయల అవినీతిలో గిరిజన సొసైటీలు పావులుగా మారుతున్నాయా**

**స”హ” దరఖాస్తుపై నోరు మెదపని రెవెన్యూ అధికారులు**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో:** ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక సొసైటీల పేరిట సాగుతున్న కోట్ల రూపాయల అక్రమ దందాపై సమాచార హక్కు చట్టం రూపంలో ఒక భారీ బాంబు పేలింది. గత ఏప్రిల్ 13న చర్ల, దుమ్ముగూడెం మండలాల తహసీల్దార్ , ఎంపీడీఓ కార్యాలయాల్లో దాఖలైన ఆర్టీఐ దరఖాస్తు ఇప్పుడు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ఇసుక సొసైటీల అనుమతులు, ర్యాంపుల నిర్వహణ, గ్రామ పంచాయతీలకు దక్కాల్సిన నిజమైన ఆదాయం, పీసా చట్టం ప్రకారం చేసిన తీర్మానాలతో పాటు రికార్డుల తనిఖీ కోరుతూ దాఖలైన ఈ దరఖాస్తుకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నములుతున్నారు. ఒక్క చర్ల ఎంపీడీఓ కార్యాలయం తప్ప మిగిలిన రెవెన్యూ, మండల పరిషత్ యంత్రాంగాలు దరఖాస్తును తొక్కిపెట్టడం వెనుక ఏజెన్సీని ముంచెత్తుతున్న భారీ అవినీతి తిమింగలాలు



ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి.

**పాతరేసిన చట్టాలను స”హ” దరఖాస్తు వెలికి తీస్తుందా?**

ఈ మొత్తం వ్యవహారంపై అంతర్జాతీయ మానవ హక్కులు , నేర నిరోధక సంస్థ తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్త గంగాధర కిశోర్ కుమార్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశాడు. ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద గిరిజనుల హక్కులను కాలరాస్తూ, చట్టాలను పక్కనబెట్టి సాగిస్తున్న అక్రమ ఇసుక మైనింగ్ ఏ విధంగా జరుగుతుందో పూర్తి వివరాలు కావాలని దరఖాస్తులో కోరాడు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన ఐదో షెడ్యూల్ హక్కులను, పీసా చట్ట నిబంధనలను బడా కాంట్రాక్టర్లు, రెవెన్యూ అధికారులు కలిసి నిలువునా పూడ్చిపెడుతున్నారు. గ్రామసభల ఆమోదం లేకుండా, నిరుపేద గిరిజనులను కేవలం కాగితాలపై ‘పావులు’గా మార్చుకుని రైజింగ్ కాంట్రాక్టర్లు వేల కోట్లు కొల్లగొడుతున్నారు. స్థానిక గిరిజన సొసైటీలకు దక్కాల్సిన లాభాలను దోచుకుంటూ, గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్న తీరుపై గంగాధర కిశోర్ కుమార్ తన ఆర్టీఐ దరఖాస్తులో స్పష్టమైన ఆధారాలను కోరారు. నిజంగా పీసా తీర్మానాలు చట్టబద్ధంగా జరిగి ఉంటే, రికార్డులను బహిర్గతం చేయడానికి అధికారులకు వచ్చిన అభ్యంతరం ఏమిటో ప్రజలకు జవాబు చెప్పాల్సి ఉంది.

**సమాచారం దాస్తే సత్యం దాగుతుందా?**

**తొక్కిపెట్టిన ఫైళ్ల వెనుక భారీ స్థాయిలో అవినీతి?!**

చట్టప్రకారం 30 రోజుల్లోగా ఇవ్వాల్సిన సమాచారాన్ని నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం వెనుక ఉన్న ‘మామూళ్ల రహస్యం’ ఏమిటనేది ఇప్పుడు ఏజెన్సీలో హాట్ టాపిక్‌గా మారింది. ఆర్టీఐ దరఖాస్తులో కోరిన విధంగా ఇసుక ర్యాంపుల రికార్డులు, తనిఖీ వివరాలు బయటకు వస్తే ఏ అధికారుల ఉద్యోగాలు ఊడతాయో, ఏ రైజింగ్ కాంట్రాక్టర్ల ముసుగులు తొలగిపోతాయోనన్న భయంతోనే అధికార యంత్రాంగం సమాచారాన్ని దాచేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు వందలాది లారీలతో ఇసుక తరలిపోతున్నా, పర్యావరణ అనుమతులను తుంగలో తొక్కి నదీ గర్భాన్ని తోడేస్తున్నా అధికారులు కళ్లు అప్పగించి చూడటం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో అనేది బహిరంగ రహస్యమే.

**అక్రమాలు బయట పడతాయనే రికార్డుల తనిఖీపై మౌనమా?!**

ఆర్టీఐ చట్టంలోని ప్రత్యేక అధికారాన్ని ఉపయోగిస్తూ ప్రత్యక్ష రికార్డుల తనిఖీకి మానవ హక్కుల సంస్థ ప్రతినిధి సిద్ధమవడంతో ఇప్పుడు స్థానిక అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇప్పటివరకు దాటవేత ధోరణిని ప్రదర్శించిన చర్ల, దుమ్ముగూడెం తహసీల్దార్లు, దుమ్ముగూడెం ఎంపీడీఓ కార్యాలయాల తీరుపై జిల్లా కలెక్టర్ , తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించి సమాచారాన్ని దాస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రికార్డులను బహిరంగంగా తనిఖీ చేయించి ఇసుక దందా వెనుక ఉన్న అసలు సూత్రధారుల భరతం పట్టకపోతే ఏజెన్సీ వ్యాప్తంగా భారీ ప్రజా ఉద్యమం తథ్యమని స్పష్టమవుతోంది.